ప్రచురణార్హమైన

# భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము

## సివిల్ అప్పిల్లేట్ జూరిస్డిక్షన్

## క్రిమినల్ అప్పీల్ నెం. 447/2012

**చరణ్ సింగ్ @ చరణ్ జిత్ సింగ్**

**...అప్పీలుదారు**

**వర్సెస్**

**ఉత్తరాఖండ్ రాష్ట్రం**

**...ప్రతివాది**

## తీర్పు

**గౌరవ న్యాయమూర్తి రాజేష్ బిందాల్:**

1. మరణించిన వ్యక్తి భర్త అయిన అప్పీలుదారు, భారత శిక్షాస్మృతి, 1860 (సంక్షిప్తంగా, 'ఐపిసి') లోని 304బి, 498ఎ మరియు 201 సెక్షన్ల కింద తనపైని నేర నిరూపణను మరియు విధించిన శిక్షను సవాలు చేస్తూ ప్రస్తుత అప్పీల్ ను దాఖలు చేసినారు. విచారణ కోర్టు అప్పీలుదారుకు సెక్షన్ 304బి కింద 10 సంవత్సరాలు, సెక్షన్ 498ఎ కింద 2 సంవత్సరాలు, ఐపిసి సెక్షన్ 201 కింద 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అయితే, నైనిటాల్ లోని ఉత్తరాఖండ్ హైకోర్టు ఐపిసి సెక్షన్ 304బి కింద అప్పీలుదారుడి శిక్షను పదేళ్ల నుండి ఏడేళ్లకు తగ్గించింది.

2. అప్పీలుదారు మరియు మరణించిన చిలో కౌర్ ల వివాహం 1993లో జరిగింది. మృతురాలు తన వైవాహిక గృహంలో నివసిస్తుండినారు. ఆమె తండ్రి ప్రతాప్ సింగ్ (పిడబ్ల్యు-1) తేదీ 24.06.1995 న సాయంకాలం 6 గంటల 15 నిమిషాల సమయంలో జస్పూర

పోలీసు స్టేషన్ లో ఈ క్రింది విధంగా ఫిర్యాదు చేశారు. తన కుమార్తె వివాహం దాదాపు రెండేళ్ల క్రితం అప్పీలుదారుతో జరిగినది. వివాహ సమయంలో , అతను తన హోదాకు అనుగుణంగా తగినంత కట్నం ఇచ్చాడు. వివాహం జరిగిన రెండు నెలల తర్వాత, అతని కుమార్తె తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చి, అతనితో (పిడబ్ల్యు-1) మోటార్ సైకిల్ ను కట్నంలో ఇవ్వనందున దానిని తీసుకురావాలని తన అత్తమామలు అడుగుతున్నారని చెప్పారు. ప్రస్తుతం తనకు మోటారుసైకిల్ ఇచ్చే స్థోమత లేదని, అయితే, తాను అది ఇవ్వగల స్థితిలో ఉన్నప్పుడు, తప్పక ఇస్తానని చెప్పి , ఫిర్యాదుదారుడు తన కుమార్తెను సముదాయించి ఆమె యొక్క వైవాహిక గృహానికి తిరిగి పంపినారు. ఆ తరువాత, ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చినప్పుడల్లా, మోటారుసైకిల్ డిమాండ్ గురించి మాట్లాడడం, వివాహం జరిగిన ఒక సంవత్సరం తర్వాత, భూమి కోసం కూడా డిమాండ్ చేయడం జరిగింది . ప్రతిసారీ అతను తన కుమార్తెను సముదాయించి తిరిగి పంపించేవారు. ఫిర్యాదుకు ముందటి రోజు అంటే తేదీ 23.06.1995 న, అప్పీలుదారుతో వివాహం జరిగిన తరువాత తన కుమార్తె నివసిస్తున్న భోగ్పూర్ డ్యామ్ గ్రామానికి చెందిన జాగీర్ సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదుదారుడి వద్దకు వచ్చి, అతని కుమార్తె అయిన చిలో కౌర్ ను ఆమె అత్తమామలు హత్య చేశారు అని తెలిపినారు . ఆ సమాచారం అందుకున్న ఫిర్యాదుదారుడు తన భార్యతో కలిసి బయలుదేరి తేదీ 24.06.1995 న భోగ్పూర్ డ్యామ్ గ్రామానికి చేరుకొని 22.06.1995 ఉదయం 08.00 గంటలకు తన కుమార్తెను ఆమె భర్త అయిన చరణ్ సింగ్ (ఇక్కడ అప్పీలుదారు), ఆమె బావమరిది గుర్మీత్ సింగ్ (నిందితుడు సంఖ్య 2), అత్త శాంతో కౌర్ (నిందితుడు సంఖ్య 3) తో కలిసి కొట్టి మరియు గొంతు నులిమి చంపారని తెలుసుకొన్నారు. వారు ఫిర్యాదుదారునికి తెలపకుండానే శవమును ఖననం చేసినారు. మోటార్ సైకిల్ మరియు భూమి గురించిన డిమాండ్ ను నెరవేర్చకపోవడం వల్లనే ఆమెను చంపడం జరిగింది. ఈ విషయంలో దర్యాప్తు చేసి చరణ్ సింగ్, గుర్మీత్ సింగ్ మరియు శాంతో కౌర్లపై చార్జిషీట్ దాఖలు చేయడమైనది.

3. ప్రాసిక్యూషన్ తరపున ఆరు మంది సాక్షులను, ప్రతివాదుల తరపున ఒక సాక్షిని విచారించడం జరిగినది. ఈ సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత విచారణ చేసిన కోర్ట్ చరణ్ సింగ్ (అప్పీలుదారు), గుర్మీత్ సింగ్ మరియు శాంతో కౌర్ యెడల కూడా సెక్షన్లు 304బి, 498ఎ మరియు 201 ఐపిసి కింద నేరానిరూపణ జరిగినట్లుగా పరిగణించి వారికి ఒక్కొక్కరికి ఐపిసి సెక్షన్ 304బి కింద పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఐపిసి సెక్షన్ 498ఎ కింద రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు ఐపిసి సెక్షన్ 201 కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వీరు హైకోర్ట్ ముందు దాఖలు చేసిన అప్పీల్ ను, గుర్మీత్ సింగ్ (బావమరిది) మరియు శాంతో కౌర్ (అత్త) యెడల ఐపిసి సెక్షన్ 304బి, 498ఎ మరియు 201 కింద జరిగిన నేర నిరూపణను త్రోసిపుచ్చి అప్పీలుదారుని యెడల జరిగిన నేర నిరూపణను ఆమోదించడమైనది. కానీ , ఐపిసి సెక్షన్ 304బి కి గానూ అతనికి విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను ఏడేళ్లకు తగ్గించడమైనది. ఈ హైకోర్టు జడ్జిమెంట్ ను ప్రస్తుత అప్పీలు నందు సవాలు చేయడమైనది.

4. అప్పీలుదారుల తరపున అప్పీల్ దాఖలు చేసిన న్యాయవాది హాజరులో లేనందున, గౌరవ న్యాయవాది శ్రీ శుభ్రాంషు పాధిని, అమికస్ క్యూరీగా కోర్టుకు సహాయపడమని చెప్పడమైనది. వీరు ఈ విధంగా కోర్టుకు తెలిపినారు: ఐపిసి 304బి మరియు 498ఎ సెక్షన్ల క్రింద అప్పీలుదారుని యెడల జరిగిన నేర నిరూపణ మరియు విధించిన శిక్ష చట్టప్రకారం చెల్లవు. ఐ. పి. సి. సెక్షన్ 304బి కి సంబంధించి పూర్వ భావన కలగాలంటే ముందుగా అవసరమైనది మృతురాలు ఆమె మరణానికి ముందు సమీప కాలంలో వరకట్నం డిమాండుకు గురించిన వేధనకు , పీడనకు గురి కాబడిందని రుజువు కాబడి ఉండాలి. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 (సంక్షిప్తంగా, 'ఐఇఎ') లోని సెక్షన్ 113బి లోని అంశాల ప్రాతిపదికన వరకట్నపు చావు గురించిన పురోభావన ఏర్పడాలంటే మరణానికి ముందు సమీప కాలంలో ఆ స్త్రీ వరకట్నానికి సంబంధించి పీడనకు లేదా క్రూరత్వానికి గురికాబడినట్లుగా చూపబడి ఉండాలి.

5. ప్రాసిక్యూషన్ నేతృత్వంలోని సాక్ష్యము పరిశీలించినట్లయితే, మృతురాలి యెడల ఏ విధమైన పీడన గానీ క్రూర ప్రవర్తన గానీ ఆమె మరణానికి సమీప కాలంలో ఉన్నట్లుగా ఈ సాక్షులు ఎవరూ చెప్పి ఉండక పోవడం వల్ల ఐపిసి సెక్షన్ 304బి లేదా 498ఎ కింద నేర నిరూపణ జరిగియుండలేదు. వివాహం 1993 వ సంవత్సరం లో జరిగింది, మృతురాలు 22.06.1995 న మరణించింది. మృతురాలు యొక్క తండ్రి, అమ్మమ్మ మరియు మేన మామతో సహా కుటుంబ సభ్యులు ఎవరూ మృతురాలు తన మరణానికి సమీప కాలంలో వరకట్నం డిమాండునకు సంబంధించిన పీడనకు గురి అయినట్లుగా చెప్పి ఉండలేదు . నిజానికి, ఆమె అమ్మమ్మ మరియు ఇద్దరు మేనమామలు మృతురాలి నివాస గ్రామానికి ఒక ఫర్లాంగ్ దూరంలోనే నివసిస్తున్నారు. వారు అంత్యక్రియల సమయంలో కూడా ఉన్నారు, కానీ వారు పోలీసులకు గానీ ఇంకెవరికైనా గానీ ఫిర్యాదు చేయడం జరగియుండలేదు. నిజానికి ఆమె అమ్మమ్మ మరియు ఇద్దరు మేనమామలు మృతురాలి అంత్యక్రియల సమయంలో పంచాయతీ జోక్యంతో, కట్నానికి సంబంధించిన వస్తువులన్నింటినీ వారు తీసుకున్నట్లుగా అంగీకరించారు. ఆ స్థలానికి 290 కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న మృతురాలి తండ్రికి సమాచారం ఇవ్వడం జరిగిందని కూడా తెలపడం జరిగినది . కానీ అతడు రావడంలో జరిగిన జాప్యం వలన అంత్యక్రియలు జరగకుండా ఆపలేకపోయారు.

6. ఇందులో ఎఫ్ఐఆర్లో పేర్కొనబడిన ముఖ్య సాక్షి అయిన జాగీర్ సింగ్ ను , ప్రాసిక్యూషన్ తరపు సాక్షిగా ప్రవేశ పెట్టబడియుండలేదు . ఫిర్యాదుదారు ప్రకారం ఈ వ్యక్తి మృతురాలు తన వైవాహిక గృహంలో నివసిస్తున్న భోగ్పూర్ డ్యామ్ గ్రామ వాసి . అతడు ఫిర్యాదుదారునికి తన కుమార్తె మరణాన్ని గురించిన సమాచారాన్ని తెలియజేశాడు. ఇటువంటి ముఖ్యమైన సాక్షిని ప్రాసిక్యూషన్ ఎందుకు ఆపివేసినారు? ఈ కేసులో పిడబ్ల్యూ-6 గా వచ్చిన ధర్యాప్తు అధికారి బబ్బన్ సింగ్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, దర్యాప్తు సమయంలో జాగీర్ సింగ్ యొక్క వాంగ్మూలన్నీ నమోదు చేయడం జరిగినది. ఒకసారి ఐపిసి 304బి, 498ఎ మరియు ఐఇఎలోని 113బి సెక్షన్లలోని అంశాలు కోర్టు ముందు నిరూపణ కాకపోయినట్లైతే , వరకట్నపు చావు యొక్క పురోభావనని భావించ లేము. ఈ

వాదనలను బలపర్చడానికి, **బైజ్నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఎంపి** ((2017) 1 SCC 101) కేసు మీద ఆధారం ఉంచబడింది. ఇంకా అప్పీలుదారుడు, అతని సోదరుడు మరియు తల్లిపై ఒకే విధమైన ఆరోపణలు ఉన్నాయని వాదించారు. కానీ , అతని సోదరుడు మరియు తల్లి నిర్దోషులుగా వదిలివేయబడినారు. ఐనా , ప్రభుత్వం ఎటువంటి అప్పీల్ ను కూడా దాఖలు చేసియుండలేదు, అప్పీలుదారుడి యొక్క భార్య మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నందున ఆమె మరణం అసహజమైనది కాదు. మృతురాలు మూర్ఛ వ్యాధితో ఉన్నట్టు ఆమె యొక్క అమ్మమ్మ కూడా తన క్రాస్ ఎగ్జామినేషన్ లో అంగీకరించడం జరిగింది.

7. మరోవైపు, ప్రభుత్వం తరపున వాదించిన గౌరవ న్యాయవాది ఈ విధంగా తెలిపినారు: కట్నం మీద ఆశతో ఒక యువతిని ఆమె భర్త తరపు వారు చంపిన కేసు ఇది. వివాహానికి కేవలం రెండు సంవత్సరాల లోపల జరిగిన అసహజ మృతి ఇది. కనీసం తల్లిదండ్రులకు కూడా తెలియజేయకుండా మృతురాలిని అంత్యక్రియలు చేసినారు. అంత్యక్రియల సమయంలో ఉన్న మృతురాలి అమ్మమ్మ మరియు మేనమామలు మృతురాలి శరీరంపై గాయాలు ఉండడం మరియు ఆమె పన్ను విరిగిపోయి ఉండడం గమనించారు. కానీ బెదిరింపుల వలన వారు ఫిర్యాదు చేయలేకపోయారు. ఈ మరణం వైవాహిక గృహంలో సంభవించినందున, పురోభావనను తొలగించే భారం అప్పీలుదారుని మీదనే ఉన్నది. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ద్వారా వరకట్నం కోసం పదేపదే చేసిన డిమాండ్ గురించిన తగినంత సాక్ష్యాధారం రికార్డులో ఉన్నది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఏ విధమైన పొరపాటు లేదు. ఐపిసి సెక్షన్ 304బి కింద అప్పీలుదారునికి విధించిన శిక్షను పదేళ్ల నుండి ఏడేళ్లకు తగ్గించడం ద్వారా హైకోర్టు ఇప్పటికే తగినంత ఉదారతను చూపడం జరిగింది.

8. కక్షిదారుల తరపున గౌరవ న్యాయవాదుల వాదనలను వినడం , రికార్డులను పరిశీలించడం జరిగినది.

9. మృతురాలి వివాహం అప్పీలుదారునితో 1993 వ సంవత్సరంలో జరిగింది. ఆమె తేదీ 22.06.1995 న మరణించింది. మృతురాలి తండ్రి 24.06.1995న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్ సింగ్ (అప్పీలుదారు), బావమరిది గుర్మీత్ సింగ్ మరియు అత్త గారు శాంతో కౌర్ లపై ఎఫ్ఐఆర్ నమోదు కాబడినది. కానీ , నిందితులు హై కోర్ట్ ముందు వేసుకున్న అప్పీల్ పూర్వకముగా , బావమరిది గుర్మీత్ సింగ్ మరియు అత్త గారైన శాంతో కౌర్ లను నిర్దోషులుగా తీర్మానించడం, కానీ అప్పీలుదారుని యెడల జరిగిన నేర నిర్ధారణను ఆమోదించడం జరిగినది. ఐపిసి సెక్షన్ 304బి కింద అప్పీలుదారునికి విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను, ఏడేళ్ల కఠిన కారాగార శిక్షకు తగ్గించడమైనది. ఐపిసి సెక్షన్ 498ఎ మరియు సెక్షన్ 201 ల కింద ఒక్కొక్కదానికి విధించబడిన రెండేళ్ల కఠిన కారాగార శిక్షను ధ్రువపరచడమైనది.

10. అప్పీలుదారుని యెడల నిరూపింపబడిన 304బి మరియు 498ఎ ఐ. పి. సి. సెక్షన్ లలో గల నేరాలు వివాహమైన ఏడు సంవత్సరాలలోగా జరిగిన వరకట్నపు చావుకు సంబంధించిన పురోభావనను కలుగజేస్తున్నాయి . కక్షిదారుల తరపున గౌరవ న్యాయవాదులు చేసిన వాదనల యోగ్యతలను చూడడానికి , ఐపిసి సెక్షన్ 304బి మరియు 498ఎ మరియు భారతీయ చట్టంలోని సెక్షన్ 113బి లను పరిశీలించాల్సిన అవసరం ఉన్నది. వీటిని ఈ క్రింద ఉటంకించడం జరిగినది:-

> “304బి. వరకట్నపు చావు. — (1) వివాహం జరిగిన ఏడు సంవత్సరాలలోపు జరిగిన స్త్రీ యొక్క చావు కాలిన గాయాలు లేదా శారీరక గాయాల వలన గానీ ఇంకా ఏ ఇతర అసహజ పరిస్థితుల వల్ల గానీ సంభవించినప్పుడు, ఆ మరణానికి ముందు సమీప కాలంలో ఆమె భర్త వలన కానీ లేక ఎవరైనా ఆమె భర్త యొక్క బంధువుల వలన కానీ , కట్నం గురించి లేక దాని సంబంధం గాను క్రూరత్వం లేదా పీడనకు

గురిచేయబడినట్లుగా చూపబడినట్లైతే ఆ మరణం ఆమె భర్త లేక బంధువు కలిగించిన “వరకట్నపు చావు” గా భావించబడవలెను.

వివరణ.——ఈ సబ్ సెక్షన్ కోసం, "వరకట్నం" అనే పదాన్ని వరకట్న నిషేధ చట్టము, 1961 (28/1961) లోని సెక్షన్ 2లో చెప్పబడిన విధంగానే అర్థం చేసుకోవాలి.

(2) వరకట్నపు చావును కలిగించిన ఎవరైనా ఏడు సంవత్సరాలకు తక్కువ కాకుండా మరియు జీవిత కాలము వరకూ కారాగార శిక్షకు గురిచేయబడవలెను.

**498-ఎ. ఒక స్త్రీ యొక్క భర్త లేదా భర్త యొక్క బంధువు ఆమెను క్రూరత్వానికి గురిచేయడం**–ఎవరైనా, ఒక స్త్రీకి భర్త లేదా స్త్రీ భర్త యొక్క బంధువు అయి ఉండి, ఆ స్త్రీ ని క్రూరత్వానికి గురిచేసిన యెడల, అట్టి వ్యక్తికి మూడు సంవత్సరాల వరకు కారాగార శిక్ష తో పాటు జరిమానా విధించవలయును.

వివరణ.——ఈ సెక్షన్ కొరకు, “క్రూరత్వం” నకు అర్థం –

(ఎ) ఆ స్త్రీ ఆత్మహత్య చేసుకోవడానికి గానీ లేక ఆమె బ్రతుకునకు లేక శరీర అవయవాలకు లేదా ఆరోగ్యానికి (మానసిక లేదా శారీరక) హాని కలగడానికి దోహదపడేటంతటి ఉద్దేశపూర్వకమైన ప్రవర్తన; లేదా

(బి) ఆ స్త్రీ యెడల లేక ఆమె యొక్క బంధువు యెడల ఏదైనా చట్టవిరుద్ధమైన డిమాండ్ కోసం , ఆస్తి కోసం లేదా ఏదైనా విలువైన

సెక్యూరిటి కోసం బలవంత పెట్టడం ఆ డిమాండ్లను వారు నెరవేర్చకపోయినట్లైతే, వారిని పీడించడం.

113బి. వరకట్నపు చావును గురించిన పురోభావన —— ఒక వ్యక్తి ఒక స్త్రీ యొక్క వరకట్నపు చావును కలుగజేసినాడా అనేది ప్రశ్న అయినప్పుడు ఆమె మరణానికి ముందు సమీప సమయంలో ఆ వ్యక్తి ఆమెను వరకట్నపు డిమాండ్ లేక దానికి సంబంధించి క్రూరత్వానికి లేదా పీడనకు గురి చేసినట్లుగా చూపబడినట్లైతే కోర్ట్ ఆ వ్యక్తి వరకట్నపు చావును కలుగజేసినట్లుగా భావించాలి.

వివరణ.——ఈ సెక్షన్ కు సంబంధించి, "వరకట్నపు చావు" నకు అర్థం అనేది భారతీయ శిక్షాస్మృతి (1860లోని 45) లోని సెక్షన్ 304-బి లో చెప్పబడినట్లుగానే."

11. ఐపిసి లోని 304బి మరియు 498ఎ సెక్షన్లకు సంబంధించిన వివరణ పైన చెప్పబడిన **బైజ్నాథ్ కేసులో** పరిశీలనకు వచ్చినది . ఆ కేసులో 25 నుండి 27 పేరాలలో దీనికి గురించిన అభిప్రాయం క్రోడీకరించబడియున్నది, అది ఈ క్రింద చెప్పబడియున్నది:-

"25. వరకట్నపు చావు అనే నేరాన్ని సెక్షన్ 304-బి ఐ పీ సి నిర్వచిస్తుంది, ఇందలి అంశాలు సాధారణంగా ఈ విధంగా ఉంటాయి:

(i) సంబంధిత స్త్రీ యొక్క మరణం శారీరక గాయాలు లేక కాలిన గాయాలు లేక సహజము కాని యే ఇతర కారణముల వలన అయినా సంభవించినప్పుడు మరియు

(ii) ఇది వివాహం జరిగిన ఏడు సంవత్సరాలలోగా సంభవించినప్పుడు, మరియు

(iii) ఆమె మరణం సంభవించడానికి ముందు సమీప కాలంలో, ఆమె భర్త లేక భర్త యొక్క బంధువు ఎవరైనా వరకట్నం కోసం కానీ దానికి సంబంధించి కానీ డిమాండ్ చేయడం గురించి ఆమెను క్రూరత్వానికి లేదా పీడనకు గురి చేసినప్పుడు

ఒక స్త్రీ యొక్క భర్త లేక అతని యొక్క బంధువు ఆమెను క్రూరత్వానికి గురి చేసినప్పుడు ఆ నేరం ఈ చట్టం యొక్క సెక్షన్ 498-ఎ పరిధిలోనికి వస్తుంది. ఈ సెక్షన్ యొక్క వివరణ "క్రూరత్వం" అనే పదాన్ని ఈ విధంగా నిర్వచిస్తుంది:

(i) ఆ స్త్రీ ఆత్మహత్య చేసుకోవడానికి గానీ లేక ఆమె బ్రతుకునకు లేక శరీర అవయవాలకు లేదా ఆరోగ్యానికి (మానసిక లేదా శారీరక) హాని కలగడానికి దోహదపడేటంతటి ఉద్దేశపూర్వకమైన ప్రవర్తన; లేదా

(ii) ఆ స్త్రీ యెడల లేక ఆమె యొక్క బంధువు యెడల ఏదైనా చట్టవిరుద్ధమైన డిమాండ్ కోసం , ఆస్తి కోసం లేదా ఏదైనా విలువైన సెక్యూరిటి కోసం బలవంత పెట్టడం మరియు ఆ డిమాండ్లను వారు నెరవేర్చకపోయినట్లైతే, వారిని పీడించడం.

**26.** అందువలన వరకట్నం కోసం లేదా ఆ సంబంధితంగా ఒక స్త్రీని ఆమె భర్త లేదా అతని బంధువు ఏదైనా ఆస్తి లేక విలువైన సెక్యూరిటీ కొరకు డిమాండ్ చేయడం , ఇందుకుగానూ పీడనకు గురిచేయడం అనేది ఈ రెండు నేరాలలోనూ ఉన్న సంఘటక అంశం అనేది స్పష్టమౌతున్నది.

**27.** "కట్నము" అనే పదానికి వరకట్న నిషేధ చట్టము, 1961 లోని సెక్షన్ 2 లో చెప్పబడిన అర్థమే వస్తుంది . "క్రూరత్వం" అనే పదానికి , హింసించేవాని ప్రవర్తనే కాక ఆ ప్రవర్తనకు గురికాబడిన స్త్రీ అనుభవించే పర్యవసానాలు కూడా ఈ పదంలో అవక్షేపించబడినవి. ఏది ఏమైనా వరకట్నం కోసం గానీ , దానికి సంబంధంగా గానీ , భర్త లేదా అతని బంధువు

ఎవరైనా, గురి చేసే క్రూరత్వం లేక పీడన, అనేది, ఈ రెండు నేరాలలోనూ ముఖ్యమైన అంశం అనేది పునరుద్ఘాటించవచ్చు.

12. ముందు చెప్పబడిన కేసు కూడా వరకట్నపు చావుకు సంబంధించినదే అయినందున , ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ యొక్క సెక్షన్ 113బి గురించి కూడా ఈ తీర్పు యొక్క 29 నుండి 31 వరకు గల పేరాల్లో విశదంగా చర్చించబడింది. అది ఈ క్రింద పొందు పర్చబడింది: –

> "**29.** గమనించదగ్గ విషయం ఏమిటంటే ఈ పురోభావన కూడా నేరానికి పాల్పడిన వ్యక్తి వరకట్నం కోసం ఏదైనా డిమాండ్ చేసినందుకు లేదా దానికి సంబంధించి చనిపోయిన మహిళను క్రూరత్వం లేదా పీడనకు గురి చేసినట్లు రుజువు చేయడం మీద ఆధారపడి ఉన్నది. వరకట్నం కోసం ఏదైనా డిమాండ్ చేసినందుకు లేదా దానికి సంబంధించి మరణించిన మహిళ ఆమె మరణానికి ముందు సమీప కాలంలో క్రూరత్వం లేదా పీడనకు గురైందనే విషయాన్ని రుజువు చేయడం మీద మాత్రమే, వరకట్న మరణానికి సంబంధించిన పురోభావన క్రియాత్మకం అవుతుంది. అందువల్ల అటువంటి రుజువు, దానితో అభియోగాలు మోపబడిన వ్యక్తి వరకట్న మరణ నేరం చేసినట్లు చట్టబద్ధంగా నిర్దేశించబడిన పురోభావనను ప్రేరేపించడానికి, చట్టబద్ధంగా తప్పనిసరి ముందస్తు అవసరం.
>
> **30.** ఈ మూడు నిర్దేశాల యొక్క ఉమ్మడి పఠనం, నేరస్తులకు వ్యతిరేకంగా ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ సెక్షన్ 113–బి లో పొందుపరచబడిన పురోభావన యొక్క ప్రయోజనాన్ని పొందడానికి మిగిలిన రెండు నేరాల యొక్క అంశాలను ప్రత్యక్ష మరియు విశ్వసనీయ సాక్ష్యము ద్వారా నిర్వివాదంగా ధృవీకరించడానికి, ప్రాసిక్యూషన్ పై గల బాధ్యతను రూఢి పరుస్తున్నది. అందువల్ల భర్త లేదా అతని బంధువు లేదా అభియోగాలు మోపబడిన వ్యక్తి యొక్క క్రూరత్వం లేదా పీడనలకు రుజువు అనేది చట్టబద్ధమైన పురోభావనను ప్రేరేపించడానికి, దాని పరిధిలోనికి అభియోగాలు మోపబడిన వ్యక్తిని తేవడానికి,

అనివార్యమైనది. అటువంటి వాస్తవాన్ని నిరూపించడానికి ప్రాసిక్యూషన్ ఖచ్చితమైన, సంధర్భ శుద్ధి గల మరియు విశ్వసనీయమైన సాక్ష్యము ద్వారా ప్రదర్శించడంలో విఫలమైతే, ఆరోపణలను ఎదుర్కొనే వ్యక్తి పైన పేర్కొన్న నేరాలలో దేనినైనా చేసినట్లు రుజువు చేయడంలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి, కేవలం పురోభావనను ఆశ్రయించడానికి వీలు లేదు.

**31.** ఆచరణాత్మకంగా అందుబాటులో ఉండని వైవాహిక గృహం యొక్క రక్షిత పరిమితులలోని జీవితం గురించిన రుజువును చేయడంలో ఉన్న కఠినతను నివారించడం , అభియోగాలు మోపిన వ్యక్తికి వ్యతిరేకంగా ఒక పురోభావన ప్రకారం, పారిణామిక శూన్యతను భర్తీ చేయడం సాధ్యం కాదు. సెక్షన్లలోని అంశాలను , ప్రాథమిక వాస్తవాలను విశ్వసనీయంగా రుజువు పరచడంలోని వైఫల్యాన్ని మరుగునపెట్టడానికి మరియు క్షమించటానికి చూడకూడదు, లేకపోతే న్యాయం ప్రమాదానికి గురి అవుతుంది.

13. ముందు చెప్పిన తీర్పులో ఐపిసి సెక్షన్ 304బి మరియు ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ సెక్షన్113 బి లను ఈ పురోభావన ప్రాతిపదికగా ఉమ్మడి పఠనం చేసి పైన పేర్కొన్న తీర్పు యొక్క 32 వ పేరాలో చర్చించారు. దీనిని ఈ క్రింద సంగ్రహించడం జరిగినది:-

**"32. షిండో వర్సెస్ పంజాబ్ రాష్ట్రం, (షిండో వర్సెస్ పంజాబ్ రాష్ట్రం (2011) (11 ఎస్. సి. సి. 517) : (2011) 3 ఎస్. సి. సి. (Cri) 394) లో చెప్పబడి, అదే విషయం రాజీవ్ కుమార్ వర్సెస్ హర్యానా రాష్ట్రం(రాజీవ్ కుమార్ వర్సెస్ హర్యానా రాష్ట్రం (2013) 16 ఎస్. సి. సి. 640 : (2014) 6 SCC (Cri) 346)** లో తిరిగి చెప్పబడినట్లుగా, ఐపిసి సెక్షన్ 304-బి మరియు ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ లోని సెక్షన్ 113బి ల యొక్క పరిధి మరియు ఉద్దేశాలను గురించి

ఆలోచిస్తున్నప్పుడు, ప్రాసిక్యూషన్ మొదటగా 304–బి సెక్షన్ క్రింది నేరంలోని అంశాలను అన్నింటినీ నిర్ధారించి తెలపడం మీదనే , పురోభావన అనేది ఆధారపడి ఉంటుందని, ఈ కోర్ట్ ప్రతిపాదించడమైనది. ఐపియసిసెక్షన్ 304–బి కింద వరకట్నపు చావుకు సంబంధించి ముఖ్యమైన అంశం ఏమిటంటే, ముద్దాయి, స్త్రీ యొక్క మరణానికి ముందు సమీప కాలంలో , ఆమెను క్రూరత్వానికి గురి చేసి ఉండడం మరియు మరియు ఈ అంశాన్ని ప్రాసిక్యూషన్ సహేతుక–అనుమానానికి అతీతంగా రుజువు చేసినప్పుడే ఆ ముద్దాయి వరకట్నపు చావును కలుగజేసాడనే పురోభావనకు ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ సెక్షన్ 113–బి కింద అవకాశం ఉంటుంది, అని రాజీవ్ కుమార్ కేసులో ఈ కోర్ట్ ప్రతిపాదించడమైనది. దీనిని **కె. ప్రేమ ఎస్. రావు వర్సెస్ యాద్ల శ్రీనివాసరావు (కె. ప్రేమ ఎస్. రావు వర్సెస్ యాద్ల శ్రీనివాసరావు, (2003) 1 ఎస్. సి. సి. 217** : 2003 **ఎస్. సి. సి.** (Cri) 271**) కేసులో** ముందు ఇచ్చిన తీర్పులో ఆమోదంతో ప్రస్తావిస్తూ, ఈ కోర్ట్ , ఐపితసి యొక్క సెక్షన్ 304–B యొక్క పరిధిలోనికి నేరం రావాలంటే రుజువు చేయబడవలసిన ముఖ్యమైన అంశం ఏమిటంటే , తన మరణానికి ముందు సమీప కాలంలో వరకట్నం గురించిన డిమాండ్ తో గానీ దానికి సంబంధంగా గానీ , ఆమె క్రూరత్వానికి మరియు పీడనకు గురిచేయబడి ఉండాలని, ప్రతిపాదించడమైనది.

14. పైన ప్రస్తావించిన చట్ట సూత్రాలకు అనుగుణంగా ఈ కేసులో , పురోభావనను భావించి , ప్రాసిక్యూషన్ ముద్దాయి / అప్పీలుదారునిపైని కేసును రుజువు చేయవలసిన బాధ్యత నుండి విడుదల చేయబడగల వర్గంలోనికి వస్తుందా, అన్న విషయాన్ని పరిశీలించవలసి ఉంటుంది.

15. మృతురాలి యొక్క మరణ తేదీ 22.6.1995. అదే రోజు ఆమె అంత్యక్రియలు చేయడం జరిగింది. అప్పీలుదారుని ప్రకారం 290 కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న మృతురాలి

తల్లిదండ్రులకు విషయం తెలపబడింది. కానీ , వారు సమయానికి రాలేకపోయారు. ఆమె అమ్మమ్మ, మేనమామలు ఆమె నివసిస్తూ, మరణించిన వైవాహిక గృహానికి, సుమారు ఒక ఫర్లాంగ్ దూరంలో నివసిస్తుండడం వలన వారు అంత్యక్రియల సమయంలో అక్కడ ఉన్నారు. వారు ఎటువంటి సమస్యను లేవనెత్తడం లేదా పోలీసులకు సమాచారం ఇవ్వడం చేయలేదు. పైగా పంచాయతీ జోక్యంతో, వారు కట్నం వస్తువులన్నింటినీ తీసుకున్నారు.

16. క్రూరత్వం లేక పీడన మరణానికి ముందు సమీప కాలంలో జరిగి ఉండాలి . మృతురాలు తన వివాహం జరిగిన రెండు నెలల తర్వాత తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చినప్పుడు, అప్పీలుదారుడు మోటారుసైకిల్ కోసం డిమాండ్ చేస్తున్నాడని చెప్పినట్లుగానూ , కానీ , ఆమెను తిరిగి పంపినట్లుగానూ ఆమె తండ్రి అయిన ప్రతాప్ సింగ్ (పిడబ్ల్యు-1) చెప్పి ఉన్నారు. తరువాత, మళ్ళీ మృతురాలు మోటారుసైకిల్ గురించి అప్పీలుదారుడు డిమాండ్ చేస్తూ ఒత్తిడి చేస్తున్నట్లుగా అతనికి తెలిపియున్నారు. మోటారుసైకిల్ తో పాటు భూమిని గురించిన డిమాండ్ కూడా జరిగి ఉన్నది. ఈ విధముగా ఇచ్చిన వాంగ్మూలంలో ఈ డిమాండ్లు ఏవీ మరణానికి ముందు సమీప కాలంలో చేసినట్లుగా చెప్పబడలేదు. అవి అన్నీ పాత డిమాండ్లు. అతని క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో తన అత్తగారు మరియు బావ మరుదులు అంత్యక్రియల సమయంలో ఉన్నారని ఒప్పుకున్నారు. కానీ వారు బెదిరింపుల వలన ఫిర్యాదు ఇవ్వలేదు అన్నారు. కేవలం వివాహం సమయంలో మృతురాలి తండ్రి తగినంత కట్నం ఇచ్చారని మాత్రమే మృతురాలి మేనమామ అయిన బల్బీర్ సింగ్ (పిడబ్ల్యు-2) వాంగ్మూలం ఇచ్చినాడు. కానీ, తర్వాత తాను మోటారుసైకిల్ గురించి అప్పీలుదారుడు డిమాండ్ చేసినట్లు విన్నానన్నాడు. అతడు అప్పీలుదారుని ఇంటికి సుమారు ఒక ఫర్లాంగ్ దూరంలో నివసిస్తున్నట్లుగా క్రాస్ ఎగ్జామినేషన్ లో అంగీకరించాడు. వివాహం సమయంలో కట్నం గురించి డిమాండ్ ఏదీ లేదు. ఇతడు మృతురాలి యొక్క వైవాహిక గృహానికి సమీపంలోనే నివసిస్తున్నప్పటికీ కట్నం డిమాండ్ గురించి కానీ, ఆ డిమాండ్ ను నెరవేర్చకపోవడం వల్ల ఏదైనా పీడన ఉన్నదని కానీ మృతురాలు తనతో ఎప్పుడైనా చెప్పినట్లుగా ఇతడు పేర్కొనలేదు.

17. తన ఇల్లు మృతురాలి ఇంటికి సుమారు ఒక మైలు దూరంలో ఉందని ఆమె అమ్మమ్మ అయిన బీరో బాయి (పిడబ్ల్యు-3) చెప్పియున్నది. మృతురాలి ఇంటికి ఈమె తరచూ వెళ్తూ ఉండేది. వారు మృతురాలిని సరిగా చూసుకునే వారు కాదు. ఆమెను తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లనిచ్చేవారు కాదు. అప్పీలుదారుడు మోటారుసైకిల్ గురించి డిమాండ్ చేస్తున్నట్లుగా మృతురాలు తన అమ్మమ్మతో తెలిపినది. ఈ సాక్షి భర్త 1995 ఫిబ్రవరిలో మరణించిన తరువాత, అప్పీలుదారుడు ఈమె నుండి భూమిని తీసుకురమ్మని మృతురాలిని అడిగినారు. ఆ డిమాండ్ చేసినప్పుడు ఈమె దానికి ఒప్పుకోలేదు అని ఈ సాక్షి చెప్పినది. కానీ ఈమె క్రాస్ ఎగ్జామినేషన్లో ఉన్నప్పుడు తన నుండి భూమి గురించి డిమాండ్ ఏమీ చేయలేదని చెప్పినది. అప్పీలుదారుడు కానీ, అతని యొక్క కుటుంబ సభ్యులు కానీ మృతురాలి మరణానికి ముందు సమీప కాలంలో ఆమెను క్రూ రత్వంనకు లేదా పీడనకు గురి చేసినట్లుగా ఈమె ( పిడబ్ల్యు-3) సాక్ష్యం తెలపడం లేదు. ఈ సాక్షి మృతురాలికి అమ్మమ్మ అయి ఉంది మృతురాలి గృహానికి సుమారు కిలోమీటరు పరిధిలోనే నివసిస్తున్నప్పటికీ క్రూరత్వం లేదా పీడన గురించి వివరాలు ఏవీ ఈమె తెలపలేదు.

18. మృతురాలి మేనమామ అయిన జోగిందర్ సింగ్ (పిడబ్ల్యు-4) ప్రాసిక్యూషన్ కు సంబంధించి మరో సాక్షి. ఇతను ప్రాసిక్యూషన్ కు వ్యతిరేక సాక్షిగా ప్రకటించబడ్డాడు.

19. ఈ కేసులో పిడబ్ల్యు-5 గా విచారించబడిన సబ్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర సింగ్ కేవలం ఎఫ్ఐఆర్ ను నమోదు చేసి ముద్దాయిలను అరెస్టు చేసిన వ్యక్తి.

20. ఈ కేసులో 6వ సాక్షి అయిన ఫరీద్పూర్ సర్కిల్ ఆఫీసర్ బబ్బన్ సింగ్, ఇందులోని దర్యాప్తు అధికారి. అతను చీఫ్ ఎగ్జామినేషన్ లో ఉన్నప్పుడు , తాను జాగీర్ సింగ్ యొక్క వాంగ్మూలం ను నమోదు చేసినట్లుగా ఒప్పుకున్నారు. ఇతడు (జాగీర్ సింగ్) పోలీసు వారికి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, మృతురాలి తండ్రికి ఆమె మరణాన్ని గురించి తెలిపిన వ్యక్తి. కానీ , అతడిని కోర్ట్ ముందు సాక్ష్యము ఇవ్వడానికి తీసుకరాబడలేదు.

21. పైన చెప్పబడిన ప్రాసిక్యూషన్ యొక్క సాక్ష్యం ప్రకారం ఏ సాక్షి కూడా మృతురాలి యొక్క మరణానికి ముందు సమీప కాలంలో అప్పీలుదారుడు కానీ లేక అతని కుటుంబ సభ్యులు ఎవరైనా కానీ వరకట్నపు డిమాండ్ కు సంబంధించి మృతురాలిని క్రూరత్వానికి లేదా పీడనకు గురిచేసినట్లుగా

చెప్పియుండలేదు. పీడన గురించి ఎవ్వరూ కూడా వివరించలేదు. సంఘటనకు చాలా కాలం ముందు మోటారుసైకిల్ గురించి డిమాండ్ చేయబడినట్లుగా కొంత వాంగ్మూలం ఉన్నది. ఈ సాక్షాల ద్వారా ఐపిసి సెక్షన్ 304బి లేదా ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ సెక్షన్ 113బి క్రింద పురోభావనను ఏర్పరచడానికి అవసరమైన అంశాలను ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయింది. ఈ కారణంగానే మృతురాలి మరణానికి ముందు సమీప కాలంలో క్రూరత్వం మరియు పీడన ఉన్నట్లుగా సాక్ష్యం ఏదీ లేకపోవడం, వల్ల, ఐపిసి సెక్షన్ 498ఎ లోని అంశాలు కూడా రుజువు కాబడలేదు.

22. ప్రతివాదన తరపున సంఘటన సమయానికి గ్రామ పెద్ద అయిన గుర్మేజ్ సింగ్ ను డిడబ్ల్యు-1గా విచారించడం జరిగినది. అతడు మృతురాలి మరణ సమాచారాన్ని ఆమె తల్లిదండ్రులకు, ఇతర కుటుంబ సభ్యులకు తెలిపినట్లుగా చెప్పినారు. ఇంకా మృతురాలికి సంబంధించిన వస్తువులు అన్నింటినీ అంత్యక్రియల సమయంలో ఆమె అమ్మమ్మ, మేనమామలకు అందజేసినట్లుగా కూడా తెలిపారు. ఇతని యొక్క వాంగ్మూలం మృతురాలి అమ్మమ్మ అయిన బీరో బాయి (పిడబ్ల్యు-3) మరియు బల్బీర్ సింగ్ (పిడబ్ల్యు-2) లు ఒప్పుకున్న అంశాలకు అనుగుణంగానే ఉన్నది. అంటే మృతురాలి మరణానికి సంబంధించి ఎటువంటి అనుమానం లేదని అర్థం.

23. ప్రాసిక్యూషన్ వారి సాక్ష్యాల సమగ్ర పరిశీలన తర్వాత, ఐపిసి సెక్షన్ 304బి మరియు ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ లోని సెక్షన్ 113బి కింద పురోభావనను రేకెత్తించడానికి అవసరం అయిన అంశాలేవీ రుజువు కానందున అప్పీలుదారునికి వ్యతిరేకంగా జరిగిన నేర నిర్ధారణ న్యాయ బద్ధం కాదని మా పరిశీలనాత్మక అభిప్రాయం. కేవలం వివాహం అయిన 7 సంవత్సరముల లోగా మృతురాలు ఆమె వైవాహిక గృహంలో అసహజ మరణం చెంది ఉండడం అన్నది మాత్రమే ఐపీసీ సెక్షన్ 304బి,

498ఎ ల  కింద ముద్దాయి యొక్క నేర నిర్ధారణ చేయడానికి సరిపోదు. పైగా మృతురాలి యొక్క మరణ కారణం తెలియదు.

24. పైన పేర్కొన్న కారణాల మూలంగా, మా అభిప్రాయం ప్రకారం, ఐపిసి సెక్షన్ 304బి, 498ఎ మరియు 201 ల కింద అప్పీలుదారునిపై జరిగిన నేర నిర్ధారణ మరియు అతనికి విధించబడిన శిక్షలు సమర్థనీయం కావు. తదనుగుణంగా ఈ అప్పీల్ ను ఆమోదించడమైనది. హైకోర్టు వారు ఇచ్చిన వివాదాస్పద తీర్పును త్రోసిపుచ్చడమైనది. జామీను బాండ్లను రద్దు పరచడమైనది.

న్యాయమూర్తి.

(అభయ్ ఎస్. ఓకా)

న్యాయమూర్తి.

(రాజేష్ బిందాల్)

న్యూ ఢిల్లీ

ఏప్రిల్ 20,2023